



బుక్‌లెట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి భరత్, మేయర్, కమిషనర్, నాయకులు, అధికారులు

నీరు దొరకదు.. గొంతు తడవదు...

- వర్షాలు కురుస్తున్నా వేధిస్తున్న నీటి సమస్య
- అవసరమున్నా అందని నిధులు
- నీటి కోసం గ్రామాల్లో తప్పని తిప్పలు

వర్షాలు కురుస్తున్నా జిల్లాలో నీటి సమస్య వేధిస్తోంది. నీటి సమస్య పరిష్కారానికి నిధులు అవసరమున్నా నిధులు అందడం లేదు. దీంతో పలు గ్రామాల్లో నీటి కోసం ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. నీటి కోసం పనులు మానుకుని గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది...



ఆస్పరి మండలం తంగరడోనలో ట్యాంకు వద్ద నీటి కోసం ఎదురుచూస్తున్న ప్రజలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/విలేకరులు

జిల్లాలో వేసవి ఆరంభం నుంచే నీటి ఎద్దడి ప్రారంభమైంది. ప్రస్తుతం వర్షాలు పడుతున్నా ఇప్పటికీ నీటి సమస్య తీరడం లేదు. తాగునీటి పథకాలున్నా నిధులు లేకపోవడంతో ప్రజలు నీటి కోసం అవస్థలు పడాల్సి వస్తోంది. కర్నూలు జిల్లాలో 57 సిపిడబ్ల్యూఎస్ పథకాల ద్వారా 682 గ్రామాలకు మంచినీరు సరఫరా అవుతోంది. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 90 గ్రామాల్లో నీట సమస్య వేధిస్తోంది. పశ్చిమ ప్రాంతంలోనే సమస్య అధికంగా ఉంది. దేవనకొండ మండలంలోని గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం తిప్పలు పడుతున్నారు. గ్రామాల్లో ప్రజల దాహార్తిని తీర్చడానికి, తాగునీటి ఎద్దడి నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో తాగునీరు దొరకక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. **దేవనకొండ** మండలంలో 26 పంచాయతీలకు 44 గ్రామాలు ఉన్నాయి. ఇందుకుగాను గాజులదిన్నె ప్రాజెక్టు ద్వారా బండగట్టు, క్రిష్ణగిరి సిడబ్ల్యుఎస్, 35 రక్షిత మంచినీటి పథకాలు, 28 మినీ గుమ్మిల ద్వారా, 160 చేతి పంపులు, బోర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. వేసవికాలం కావడంతో రక్షిత నీటి పథకాల భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో మండలంలో ప్రధానంగా మాదాపురం, కె.వెంకటాపురం గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. **ఆస్పరి** మండలంలో 21 పంచాయతీలు, 33 గ్రామాలు ఉన్నాయి. 16 గ్రామాలలో నీటి సమస్య గుర్తించగా జోహారపురం, గాలిపెంట, కారుమంచి గ్రామాలలో ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేస్తున్నారు. అట్టేకల్లు గ్రామంలో ఓ రైతు పొలంలో ఉన్న వ్యవసాయ బోరు నుండి గ్రామంలోకి పైప్ లైన్ ద్వారా నీళ్లు సరఫరా చేస్తున్నారు. ఆస్పరి, తంగరడోన, హలిగేర, ములుగుందం, చిరుమాన్ దొడ్డి గ్రామాలలో 6 రోజుల నుండి 10 రోజుల ఒకసారి నీళ్లు వదులుతున్నారు. పుప్పాలదొడ్డిలో నీటి సమస్య ఎద్దడి ఎక్కువగా ఉంది. మండలంలో మొత్తం 93 పథకాలు గాను 83 పని చేస్తున్నాయి. పది పథకాలు పనిచేయడం లేదు. **గూడూరు** మండలం కానాపురం, గుడిపాడు గ్రామాల్లో తాగునీటి సమస్య ఎక్కువగా ఉంది. గుడిపాడు గ్రామంలో ఒక కిలోమీటర్ దూరంలోని కుంట నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. కానాపురంలోనూ అదే పరిస్థితి నెలకొంది. **చిప్పగిరి** మండలం నంచెర్లలో తాగునీటి సమస్య ఉంది. **నందవరం** మండలంలో ఎనిమిది గ్రామాల్లో నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 4 గ్రామాలలో నీటి సరఫరా కోసం రూ.3 లక్షలు ఖర్చు చేశారు. **గోనేగండ్ల** మండలంలోని కున్నూరు, బి అగ్రహారం, గోనేగండ్ల, కులుమాల, పెద్దమరివీడు గ్రామాల్లో నీటి సమస్య ఉంది. రూ.1.35 కోట్ల గ్రాంట్ కోసం ప్రతిపాదనలు పంపగా ఇంకా మంజూరు కాలేదు. ఇలా పాలకుల నిర్లక్ష్య వైఖరి, ప్రభుత్వ ఉదాసీనతతో గ్రామాల్లో నీరు దొరకడం లేదు. గొంతు తడవడం లేదు.

6 రోజుల నుండి 10 రోజులకు ఒక్కసారి

మా గ్రామంలో 6 రోజుల నుండి 10 రోజులకు ఒక్కసారి మంచి నీళ్లు వస్తున్నాయి. ప్రత్యేకంగా నీళ్ల కోసం ఒక్కరు ఇంటి దగ్గరే ఉండాలి. గుక్కెడు నీటి కోసం గంటల తరబడి వేచి చూడాలి. అధికారులు స్పందించి నీటి సమస్యలను పరిష్కరించాలి.

- రవితేజ, తంగరడోన, ఆస్పరి మండలం.

ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు



గ్రామంలో నీళ్ల రాక చాలా ఇబ్బంది పడుతున్నాం. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. నీళ్ల కోసం చిన్న, పెద్ద అని తేడా లేకుండా కొళాయి వద్ద గంటల తరబడి ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది.

- రామంజినేయులు, పుప్పాల దొడ్డి, ఆస్పరి మండలం.

చర్యలు తీసుకుంటున్నాం



జిల్లాలో 90 గ్రామాల్లో నీటి సమస్య ఉన్నట్లు గుర్తించాం. ఎనిమిది గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నాం. ఎస్‌డిఆర్ఎఫ్ నిధులతో తాగునీటి రవాణాకు, ప్రయివేటు వనరులను ఏర్పాటు చేసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ.

రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంది

- క్రెడాయ్ ఎక్స్ ప్రాపర్టీ షోలో మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కూటమి ప్రభుత్వ రాకతో జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటుందని రాష్ట్ర పరిశ్రమలు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ అన్నారు. శుక్రవారం కర్నూలు నగరంలోని ఎస్‌టిబిసి కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన క్రెడాయ్ ఎక్స్ ప్రాపర్టీ షో 2025ను మంత్రిభరత్, ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మేయర్ బివై.రామయ్య, మునిసిపల్ కమిషనర్ రవీంద్రబాబు, క్రెడాయ్ ప్రెసిడెంట్ సురేష్ రెడ్డి, కన్వీనర్ నగరూరు శ్రీనివాసరావు, చైర్మన్ గోరంట్ల రమణ, పలువురు క్రెడాయ్ సభ్యులతో కలిసి ఘనంగా ప్రారంభించారు. అనంతరం క్రెడాయ్ ప్రచురించిన బుక్ లెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి భరత్ మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా నేల వాలిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 15 నుంచి 20 శాతం అభివృద్ధి అయిందన్నారు. ఏ ప్రభుత్వమైనా పని బాగా చేస్తుందని చెప్పడానికి అక్కడ రియల్ ఎస్టేట్ రంగం ఎంత అభివృద్ధి అయిందో అన్నదాన్ని బట్టి అంచనా వేయొచ్చని అన్నారు. రియల్ ఎస్టేట్ రంగం రాబోయే రోజుల్లో మరింత వృద్ధి చెందేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జిల్లాలో నూతన పరిశ్రమలు రాకతో అది సాధ్యమవుతుందన్నారు. ఇప్పటికే ఆ వైపుగా తాను ప్రభుత్వంతో మాట్లాడి కృషి చేస్తున్నానన్నారు. ఓర్వకల్లు వద్ద ఉన్న ఇండస్ట్రియల్ పార్కులో ఇప్పటికే రూ.14 వేల కోట్లతో సెమీ కండక్టర్ పరిశ్రమ, రూ. 1000 కోట్లతో ఈవి స్కూటర్ పరిశ్రమ ఏర్పాటుకు ఎంఒయు కుదిరిందని, ఇప్పటికే కేబినెట్లో ఆమోదం కూడా పొందిందన్నారు. త్వరలోనే మరిన్ని పరిశ్రమలను స్థాపించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాగమయూరి బిల్డర్స్ కెజెరెడ్డి, సోమిశెట్టి బిల్డర్స్ వెంకటరామయ్య, న్యూ స్నేహ బిల్డర్స్ సిద్దయ్య, క్రెడాయ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం

సక్రమంగా అమలు చేయాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం సక్రమంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం అమలుకు సంబంధించిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. సమావేశంలో జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్, జిల్లా అధికారులు, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ 2013 నుండి 2025 వరకు పెండింగులో ఉన్న ఎస్సీ, ఎస్టీ అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను పోలీసు అధికారులతో సమీక్షించారు. చాలా రోజుల నుంచి పెండింగులో ఉన్న కేసులను కూడా త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఛార్జ్ షీట్ అయి నెంబరింగ్ కాని కేసుల వివరాల లిస్ట్ ఇవ్వాలని, సంబంధిత నివేదికను జడ్జికి అందజేసి నెంబరింగ్ వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. క్యాస్ట్ సర్టిఫికెట్ కారణంగా ఏ కేసు కూడా పెండింగ్ ఉండకూడదని, రెవెన్యూ అధికారులు ఈ అంశంపై తక్షణం స్పందించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్, డిసిఆర్‌బి సిఐలు సమన్వయంతో ఇప్పటివరకు ఉన్న కేసులకు సంబంధించి రిజిస్టర్ నిర్వహించాలని, తద్వారా కేసు స్టేటస్ ఏ స్థాయిలో ఉంది అని తెలుస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార బాధిత కుటుంబాలకు త్వరితగతిన రిలీఫ్, ఇతర ప్రయోజనాలను అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత 6 నెలల్లో బాధిత కుటుంబాలకు మానిటరీ రిలీఫ్ కింద రూ.4 కోట్లు అందించామన్నారు. ఇంకా పెండింగ్ లో రూ. రూ.50 లక్షలు ఉందని, ఆ మొత్తాన్ని కూడా త్వరితగతిన ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టిల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఎస్‌సి వసతి గృహాల మరమ్మతులకు గాను రూ.7 కోట్లు మంజూరు చేసిందన్నారు. అందులో దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయని, పెండింగులో ఉన్న 20 శాతం పనులు కూడా త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. హాస్టళ్లకు వంట పాత్రలు కూడా కొత్తవి మంజూరు చేశామన్నారు. జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ కేసులకు సంబంధించి సోషల్ మీడియాలో రూమర్లు వ్యాపింప చేయడం వల్ల శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతుందని తెలిపారు. అలా చెయ్యకుండా సభ్యులు చొరవ తీసుకోవాలని ఎస్‌పి సూచించారు.. ఏవైనా సమస్య ఉంటే సమావేశం వరకు ఆగకుండా తనకు లేదా కలెక్టర్ దృష్టికి తెస్తే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎస్‌పి సూచించారు. సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్ఒ సి.వెంకటనారాయణమ్మ, కర్నూలు ఆర్‌డిఒ సందీప్, పత్తికొండ ఆర్‌డిఒ భరత్, సాంఘిక సంక్షేమ అధికారి తులసీ దేవి, డివిఎంసి సభ్యులు రవికుమార్, సురేష్ గౌడ్, వెంకట నాగరాజు యాదవ్, మాలతి, మధు నాయక్, మద్దిలేటి, కురువ మద్దిలేటి, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

గోనెగండ్లలో విషాదం...

- ట్యాంకులో ఈతకు దిగి ఇద్దరు బాలికలు మృతి



రోదిస్తున్న బాలికల కుటుంబ సభ్యులు

వేసవి సెలవులు కావడంతో ఆ ఇద్దరు చిన్నారులు ఇంటి దగ్గర సరదాగా గడుపుతున్నారు. ఆడుకుంటూ తల్లులతోపాటు కూలీ పనులకు వెళ్లారు. సాయంత్రం దాకా పనులు చేశారు. తిరిగి ఇంటికి వచ్చే దారిలో ట్యాంకు కనిపించింది. ఈత సరదా పెట్టింది. ట్యాంకులోకి దిగారు. ఈత సరిగ్గా రాకపోవడంతో మునిగిపోయారు. తల్లులు, సమీపంలోని వారు రక్షించేందుకు ప్రయత్నించారు. అది విఫలయత్నమే అయింది. వారిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ విషాద సంఘటన గోనెగండ్లలో శుక్రవారం చోటు చేసుకుంది.

వివరాలు మెయిన్‌లో

మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు చర్యలు

- జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం పూర్తిగా అరికట్టేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో నషాముక్త్ భారత్ అభియాన్ అమలుపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం నషా ముక్తభారత్ అభియాన్ పథకం ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. 13 సంవత్సరాల నుండి 19 సంవత్సరాల పిల్లలు మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు అధ్యయనాల్లో తేలినందున, పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలలో అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు జరగాలని తెలిపారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలోనూ రాత్రి 6లో



మాట్లాడుతున్న ఆస్పత్రి సూపరిన్‌టెన్‌డెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

కోవిడ్ వైరస్ పై అప్రమత్తంగా ఉండాలి

రాపిడ్ రెస్పాన్స్ టీమ్ ల ఏర్పాటు-ఆస్పత్రి సూపరిన్‌టెన్‌డెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కోవిడ్ వైరస్ పై హెచ్ఒడిలతో సమీక్షా సమావేశం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె వెంకటేశ్వర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కోవిడ్ వైరస్‌ను ఎదుర్కోవడానికి అనుసరించాల్సిన ప్రోటోకాల్‌ను వైద్యులు వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించామని తెలిపారు. కోవిడ్ కేసుల దృష్ట్యా ఆస్పత్రిలో ఎదుర్కోవడానికి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో కోవిడ్ వైరస్ పై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. పల్మోనాలజీ, అనస్థీషియా, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్, ఎమర్జెన్సీ మెడిసిన్ మైక్రోబయాలజీ ఫ్యాకల్టీతో కూడిన రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు, రెడీ చేసుకోవాలని సంబంధిత హెచ్ఒడిలను ఆదేశించారు. పిపిఇ కిట్‌లకు సంబంధించి తగినంత స్టాక్ అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. మాస్క్ పిపిఇ కిట్స్ యాంటీ వైరల్ డ్రగ్స్, అత్యవసర ఔషధాలు అందుబాటులో ఉండేలా సర్జికల్ అండ్ మెడికల్ స్టోర్‌లకు ఆదేశాలు జారీ చేశారు. ఆక్సిజన్ పోర్ట్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అనస్తీసియా వైద్యులకు ఆదేశించారు. ఆసుపత్రిలో ఇప్పటివరకు ఎలాంటి కోవిడ్ కేసులు నమోదు కాలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వెంకటేశ్వరరావు, జనరల్ మెడిసిన్ హెచ్ఒడి, డాక్టర్ ఇక్బాల్ హుస్సేన్, అనస్తీసియా హెచ్ ఒడి, డాక్టర్ విశాల, మైక్రో బయాలజీ ప్రొఫెసర్, డాక్టర్ నాగలక్ష్మి, మైక్రో బయాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ విజయలక్ష్మి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్, డాక్టర్ శివబాల నగాంజన్, డాక్టర్ కిరణ్ కుమార్, ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, డ్రగ్స్ స్టోర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శారద, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలి

ప్రజాశక్తి-సి బెళగల్



పనులను పరిశీలిస్తున్న హౌసింగ్ పిడి చిరంజీవులు

ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను నిర్మాణాలను త్వరగా ముగించుకోవాలని హౌసింగ్ పిడి చిరంజీవి లబ్ధిదారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని బురాన్ దొడ్డి, సిబెళగల్, కంభదహాల్ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. వచ్చే నెల చివరి లోపు నిర్మాణాలు పూర్తి చేసుకోలేదో ఇది వరకు అందిన బిల్లులు రికవరీ చేస్తామన్నారు. కొత్త వారిని లబ్ధిదారులుగా గుర్తిస్తామని అన్నారు. నిర్మాణానికి సొంత నగదు సరి పోకుంటే పొదుపు ద్వారా రుణం ఇప్పిస్తామని అప్పటికైనా పనులు కాకుంటే తగు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ సుమంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రంగన్న పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

-31 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
-కర్నూలు అభివృద్ధికి భారీగా నిధులు: మంత్రి టీజీ భరత్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్ శుక్రవారం రూ.12.28 కోట్లతో 31 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. 19 వార్డుల్లో కార్పొరేటర్ ఎన్. శ్రీనివాసరావు అధ్యక్షతన సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలు, మరుగుదొడ్లు, ఫుట్‌పాత్‌లు, ఎయిర్ క్వాలిటీ డిస్‌ప్లే బోర్డులు వంటి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కర్నూలును వైజాగ్ తరహాలో అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రధానంగా రహదారులు, డ్రైనేజీలు, వీధి దీపాలు, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. పనులన్నీ నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. రూ.12.28 కోట్లతో 31 అభివద్ధి పనులు చేస్తున్నామని మంత్రి తెలిపారు. అందులో సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలు, మరుగుదొడ్లు, ఫుట్‌పాత్‌లు, ఎయిర్ క్వాలిటీ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రహదారులు, డ్రైనేజీలు, వీధి దీపాలు, పరిశుభ్రతపై దృష్టి పెట్టామన్నారు. బళ్లారి చౌరస్తాలో ట్రాఫిక్ నియంత్రణకు ఎస్‌ఎపి క్యాంపు మీదుగా రహదారి నిర్మాణ చేపడుతామన్నారు. జూన్ 2 నుండి ఓర్వకల్లు–విజయవాడ విమాన సర్వీసులు ప్రారంభిస్తామన్నారు. రూ. 2700 కోట్లతో అభివృద్ధి, సెమీ కండక్టర్, ఎలక్ట్రానిక్ వాహనాల తయారీ కంపెనీలు రానున్నాయని మంత్రి తెలిపారు. అనంతపురం నుండి కర్నూలు వరకు మెగా ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. కమిషనర్ ఎస్.రవీంద్రబాబు మాట్లాడుతూ నగర అభివృద్ధికి నగరపాలక సాధారణ నిధులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను సద్వినియోగం చేసుకుంటున్నామని తెలిపారు. నగరంలో అత్యవసర పనులకు ప్రాధాన్యతనిస్తూ, అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి టిజి.భరత్, కమిషనర్ రవీంద్రబాబు

యోగాంధ్రలో ప్రజలు భాగస్వాములు కావాలి

-అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలి
-జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

యోగాంధ్రలో ప్రజలు భాగస్వామ్యులై అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుండి రాజ్ విహార్ సెంటర్ వరకు నిర్వహించిన యోగాంధ్ర ర్యాలీని ఆమె ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ యోగాంధ్రలో ప్రజలు భాగస్వామ్యులు కావాలని, జూన్ 21 న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఘనంగా నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున అందరమూ కలిసి ఘనంగా నిర్వహించుకుంటున్నా మన్నారు. ఇప్పటికే యోగాంధ్ర క్యాంపేయన్ ప్రారంభించుకోవడం జరిగిందని, అంతర్జాతీయ యోగా దినోత్సవం ఇంకా ఒక నెల ఉన్నదని, ఈ నెల రోజులు యోగ గురించి ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని, జూన్ 21వ విశాఖపట్నంలో మెగా ఈవెంట్ జరుగుతుందని, దీనికి కొనసాగింపుగా రాష్ట్ర వ్యాప్తంగా రెండు కోట్ల మంది యోగా కార్యక్రమంలో పాల్గొనాలనే లక్ష్యంతో ఈ క్యాంపియన్‌ను ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. ఈనెల 24 , 25 తేదీలలో మాస్టర్ ట్రైనర్స్‌కు ఓరియంటేషన్ విక్షణ ఇస్తున్నారని, వారు మండల స్థాయిలో వారం రోజులు ట్రైనింగ్ ఇస్తారని తెలిపారు. ఈ యోగ ప్రోటోకాల్ ప్రకారం ట్రైనర్స్‌కు ఐదు రోజులు, జనరల్ పబ్లిక్‌కు 3 రోజులు శిక్షణ ఇస్తారన్నారు. యోగాసనాల పోటీలు నిర్వహించి గ్రామస్థాయిలో యోగాను బాగా చేసిన వారికి మండల స్థాయిలో , మండల స్థాయిలో బాగా యోగ చేసిన వారికి జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున బాగా యోగా చేసిన వారికి బహుమతులు ఇస్తారని అన్నారు. ప్రతిరోజు యోగా పై అవగాహన కల్పించుటకు ర్యాలీలు, మానవహారాలు ఏదో ఒక ఈవెంట్ ద్వారా యోగా కార్యక్రమాన్ని ప్రోత్సహించడం కోసం ఒక నెల పాటు క్యాంపెయిన్ ఉంటుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్‌జూమర్ కోర్ట్ జడ్జి కిషోర్, డిఎస్ఒ రాజా రఘువీర్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, డిఎస్‌డిఒ భూపతిరావు, డిఎఒ డాక్టర్ శ్రీనివాసులు, ఆయుష్ డిపార్టుమెంట్ డాక్టర్ కెవిఎన్ ప్రసాద్, రాష్ట్ర యోగ సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి, వినియోగదారుల సంఘాల అధ్యక్షులు శివమోహన్ రెడ్డి, ఐఒసి సేల్స్ ఆఫీసర్ రామ్మోహన్, వివిధ కంపెనీల గ్యాస్ ఏజెన్సీల సిబ్బంది, రేషన్ షాప్ డీలర్లు, వివిధ కంపెనీల పెట్రోల్ బంక్ డీలర్లు, వారి సిబ్బంది పౌరసరఫరాల శాఖ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య



ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం పత్తికొండ డివిజన్ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి

అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలి: సిపిఎం

ప్రజాశక్తి-పత్తికొండ : డివిజన్ కేంద్రమైన పత్తికొండలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి కోరారు. శుక్రవారం పత్తికొండ ఆర్‌డిఒ భరత నాయక్‌ను పత్తికొండ సిపిఎం బృందం వినతి పత్రాన్ని అందజేసింది. వెంకటేశ్వర రెడ్డి మాట్లా డుతూ పత్తికొండ రెవెన్యూ డివిజన్ కావడంతో పత్తికొండ, తుగ్గలి, దేవనకొండ ,క్రిష్ణగిరి, వెల్దుర్తి ,ఆస్పరి, ఆలూరు ,చిప్పగిరి, మద్దికేర తదితర మండలాల నుండి ప్రతిరోజు ప్రభుత్వ కార్యకలాపాల కోసం ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు రవాణా ఖర్చులతోపాటు భోజనం చేయ డానికి చాలా ఇబ్బంది పడుతున్నా రన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని అన్నారు.

పర్సాసత్యనారాయణకు ఘననివాళి

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

సిఐటియు వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పర్సా సత్యనారాయణ పదవ వర్ధంతి కల్లూరు సూర్యనారాయణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర సిఐటియు ఆఫీసులో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిఐటియు నగర కార్యదర్శి సాయిబాబా అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్. రాధా కృష్ణ, నగరనాయకులు టి.రాముడు మాట్లాడుతూ యాజమాన్యానికి అధికారులకు లొంగిపోయే నాయకులు ఉన్న సందర్భంగా దాన్ని చూసి సహించలేని పర్సా సత్యనారాయణ లాంటివారు సిఐటియును ఏర్పాటు చేసి ఆరోజు నుండి చివరి వరకు కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేశారన్నారు. మన జిల్లాలో సిఐటియు అభివృద్ధికి నిరంతరం సలహాలు సూచనలు ఇవ్వడంతో పాటు ఉన్న కార్బైడు, పేపర్ మిల్లు, బిర్లా, ఆదోనిలో ఉన్న స్పిన్నింగ్ మిల్లులలో ఏ విధంగా కార్మిక సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని చెప్పి దగ్గరుండి ఉద్యమాలు చేయించిన మహానుభావులు పర్సా అని అన్నారు. సిఐటియు నాయకులు బతుకన్న, ఎర్రమల, శేఖర్, హనుమంతు, గాలెన్న తదితరులు పాల్గొ న్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి-వెల్దుర్తి : బాల్య వివాహాలను అరికట్టాలని వాటి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ వెల్దుర్తి ప్రాజెక్టు సూపర్‌వైజర్ సరస్వతి అన్నారు. మండల పరిధిలోని బింగుదొడ్డి గ్రామసచివాలయంలో శుక్రవారం కిశోర బాలికల వికాసం వేసవి కాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు బాలికలకు పెళ్లి చేస్తే చాలా అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. మీ గ్రామ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా చిన్న వయసులో పెళ్లి చేస్తే 1098 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలన్నారు. ఎఎన్ఎం నాగమణి అంగన్వాడి టీచర్లు ఆశ వర్కర్లు కిశోర వికాస బాలికలు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న అధికారులు

రూ.1.80 కోట్లతో 'కోనేరు'కు భూమి పూజ

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో కోనేరు నిర్మాణానికి శుక్రవారం డిప్యూటీ కమిషనర్ విజయ రాజు ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కోనేరు నిర్మాణానికి బెంగళూరు నగరానికి చెందిన దాత, ఈరన్న స్వామి భక్తుడు మంజునాథ రూ.1.80 కోట్లు ఇవ్వడానికి ముందుకొచ్చారని తెలిపారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో భక్తులకు కోనేరు లేకపోవడంతో దాత మంజునాథ ముందుకు రావడం, ఎన్నో సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్న భక్తుల కల నెరవేరుతోందని చెప్పారు. మంజునాథ చేతుల మీదుగా కోనేరు నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు తెలిపారు. ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, వేద పండితులు మురళీకబుష్ణ శర్మ, ఉప ప్రధాన అర్చకులు మహాదేవ స్వామి, ముఖ్య అర్చకులు పూజన్న స్వామి, అర్చకులు శివన్న స్వామి, నాగరాజు స్వామి, మల్లయ్య స్వామి, ఈరన్న స్వామి ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. నిర్మాణానికి విరాళం అందించిన దాత మంజునాథ, రెడ్డి సంఘం నాయకులు మహేంద్ర రెడ్డి (వైసిపి మండల నాయకులు), పర్యవేక్షకులు వెంకటేష్ మల్లికార్జున పాల్గొన్నారు.

యోగాంధ్రలో భాగస్వామ్యం కావాలి

- ఎంపిడిఒ అల్లా బకాష్, ఇన్‌ఛార్జీ తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ అల్లా బకాష్

ప్రజాశక్తి - చిప్పగిరి

యోగా అనేది ప్రతి ఒక్కరికీ అవసరమని, యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని, ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలని ఎంపిడిఒ అల్లా బకాష్, ఇన్‌ఛార్జీ తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ అధికారులకు, ప్రజలకు తెలిపారు. శుక్రవారం మండల కార్యాలయంలో డిప్యూటీ ఎంపిడిఒ బాలన్న ఆధ్వర్యంలో మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జూన్ 21న యోగా దినోత్సవాన్ని విశాఖపట్నంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగాలో పాల్గొనే వారందరూ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అధికారులు కూడా ఇంటింటికీ వెళ్లి సమాచారం చేరవేస్తున్నారని తెలిపారు. ఆసక్తి ఉన్న వారందరూ యోగాలో పాల్గొనాలని పిలుపునిస్తున్నట్లు చెప్పారు. విశాఖపట్నంలో యోగా దినోత్సవం రోజున ప్రధాని నరేంద్ర మోడీ వస్తున్నారన్నారు. మండలంలో ప్రతి పంచాయతీలోనూ యోగా గురించి శిక్షణ తరగతులు నిర్వహించి జూన్ 21 నాటికి ప్రతి ఒక్కరికీ తెలిసేలా కార్యక్రమాలను రూపొందిస్తున్నామని తెలిపారు. పరిపాలనాధికారి శ్రీనివాసులు, ఎంఇఒలు సావిత్రమ్మ, శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ డాక్టర్ అఫ్రోజ్ జహాన్, ఎపిఎం నాగార్జున, సూపర్‌వైజర్ ప్రసూన, ఆస్పిరేషనల్ అధికారి నరసింహులు, పోలీసు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు చర్యలు

5వ పేజీ తరువాయి...

సమయాల్లో పార్కులు , ఓపెన్ ప్లేసెస్ , ఫ్లై ఓవర్ల లాంటి ప్రదేశాలలో కూడా ఉంటారని, వారిపై గట్టిగా నిఘా పెట్టి వారిని రిహాబిలిటేషన్ సెంటర్లకు తరలించి చికిత్స అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మత్తు పదార్థాలను వినియోగించే వారిని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లో ప్రత్యేక వార్డులో ఉంచి వారికి, మంచి వైద్య సౌకర్యాలు, కౌన్సిలింగ్ చేసి వారిని తిరిగి మత్తుపదార్థాల వైపు వెళ్ళకుండా చర్యలు తీసుకోవాలని జిజిహెచ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. మత్తు పదార్థాలు వాడుతున్న వారికి వాటి నుండి విముక్తి పొందే చర్యల్లో భాగంగా యోగా, ఫుట్‌బాల్, వాలీబాల్ క్రీడల్లో పోటీలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని డిఎస్‌డిఒను ఆదేశించారు. ఎడి డిజేబుల్డ్ రయీస్ ఫాతిమా, లీగల్ సెల్ అడ్వకేట్ హేమలత, మెప్మాపిడి నాగ శివలీల, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతికళ, ఐసిడిఎస్ పీడీ నిర్మల, డిఇఒ శామ్యూల్ పాల్, డిఎస్‌పి బాబు ప్రసాద్, హాస్పిటల్స్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసులు, డిఆర్‌డిఎ పీడీ రమణారెడ్డి, ఏపీడీ శ్రీధర్, డివిఇఒ సురేష్ బాబు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాజశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాక్స్ వసూలు కోసం పకడ్బందీగా సర్వే

- మున్సిపల్ కమిషనర్ కృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

ఇంతవరకు ట్యాక్స్ వేయని ఖాళీ స్థలాలు, భవనాలకు పక్కాగా గుర్తించే సర్వే నిర్వహించి నిబంధనల మేరకు ట్యాక్స్ వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ, రెవెన్యూ ఆఫీసర్ నాసిర్ హుస్సేన్ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ హాలులో సెక్రటరీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆదోని పురపాలక పరిధిలో గల ఇంటి పన్నుకు సంబంధించి సర్వే వచ్చే నెల 15 వరకు నిర్వహించాలన్నారు. ఇంటి పన్నుల సవరణలు వివరించారు. ఏ ఇంటికైనా లేదా స్థలానికైనా పన్ను విధించకుండా ఉంటే అలాంటి వాటిని గుర్తించాలని తెలిపారు. ఆదోనిలోని 42 వార్డుల్లో బృందాలుగా ఏర్పడి సర్వే ప్రక్రియ కొనసాగిస్తున్నట్లు చెప్పారు. స్థలానికి కచ్చితంగా పన్ను విధించాలని, ఆ దిశగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. స్థలం, భవనానికి సంబంధించిన ప్లానింగ్ మ్యాప్, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇంటి పట్టా, ఆధార్ కార్డు సేకరించాలన్నారు. ఈ సర్వే వల్ల రూ.2.70 కోట్ల ట్యాక్స్ వసూలు చేయాలని లక్ష్యం పెట్టుకున్నామని తెలిపారు. గతేడాది రూ.12.90 కోట్ల ట్యాక్స్ వసూలు చేశామని గుర్తు చేశారు. ఈ ఏడాది రూ.13 కోట్ల ట్యాక్స్ వసూలు లక్ష్యం పెట్టుకున్నామన్నారు. సమిష్టిగా కృషి చేసి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న కమిషనర్, రెవెన్యూ ఆఫీసర్

25న వాల్మీకి విద్యార్థులకు

ప్రతిభ పురస్కారాలు

- వాల్మీకి ఉద్యోగ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ బాబు



వివరాలు వెల్లడిస్తున్న వాల్మీకి ఉద్యోగ సంఘం నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన వాల్మీకి విద్యార్థులకు శ్రీమహర్షి వాల్మీకి ప్రతిభ పురస్కారాలు అందజేస్తామని వాల్మీకి ఉద్యోగ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ సుధాకర్ బాబు తెలిపారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. గౌరవ సలహాదారులు నరసయ్య, ఉపాధ్యక్షులు వాల్మీకి రమేష్ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, పురపాలక ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో గతేడాది పదో తరగతి ఫలితాలలో వాల్మీకి విద్యార్థులు చాలా మంది ప్రతిభ కనబరిచారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వాల్మీకి విద్యార్థులకు ఈనెల 25న ఎమ్మిగనూరు పట్టణంలోని పోస్టాఫీస్ ఎదురుగా ఉన్న శ్రీమహర్షి వాల్మీకి కమ్యూనిటీ హాలు వద్ద శ్రీవాల్మీకి మహర్షి ప్రతిభ పురస్కారాలను అందజేసి సన్మానం చేస్తామని చెప్పార. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఈనెల 24లోపు పేర్లు, మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం వివరాలను 7013682489, 9640718346 ఫోన్ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సభ్యులు సత్యన్న, భీమరాజు ఉన్నారు.

కర్ణాటక మద్యం రవాణాకు అడుకట్ట వేయాలి

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ

ప్రజాశక్తి - ఆలూరు

ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోని కర్ణాటక నుంచి వచ్చే అక్రమ మద్యం రవాణా, వాటి అమ్మకాలకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని ఎపి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ తెలిపారు. శుక్రవారం ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులోని హాలహర్వి మండలం క్షేత్రగుడి చెకపోస్టును తనిఖీ నిర్వహించి రికార్డులను, సిసి కెమెరాల పని తీరును పరిశీలించారు. అనంతరం ఆలూరు ఎక్సైజ్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నవోదయ 2.0లో భాగంగా శాఖ పరిధిలో అక్రమ మద్యం, నాటు సారా తయారీ, బెల్లం అమ్మకాలపై ఉక్కుపాదం మోపి పూర్తిగా నియంత్రించాలని అధికారులకు సూచించారు. కర్నూలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామకృష్ణ, డిటిఎఫ్ సిఐ రాజేంద్ర ప్రసాద్, సిఐ లలిత దేవి, ఎస్ఐ నవీన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



క్షేత్రగుడి చెకపోస్టును తనిఖీ చేస్తున్న రాహుల్ దేవ్ శర్మ

విధులకు ఆటంకం కలిగించడం తగదు

- వెహికల్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్

ప్రజాశక్తి - ఆదోని

వాహనాలు తనిఖీ చేస్తుండగా ధ్రువీకరణ పత్రాలు చూపించకుండా విధులకు ఆటంకం కలిగించేలా వ్యవహరించడం తగదని ఆదోని వెహికల్ ఇన్‌స్పెక్టర్ కదిరి మహ్మద్ అవైద్ తెలిపారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. గురువారం సాయంత్రం ఆస్పరి రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టామని తెలిపారు. మంత్రాలయం నుంచి కర్ణాటకకు చెందిన చంద్రయ్య అనే వ్యక్తి 14 మందితో వెహికల్‌లో వచ్చారన్నారు. వెహికల్‌కు సంబంధించిన రికార్డులు చూపించాలని అడగ్గా 'మీరు అసలైన అధికారులేనా' అంటూ వ్యంగంగా, దురుసుగా మాట్లాడారని తెలిపారు. ఆయన తన పట్ల దురుసుగా ప్రవర్తించారన్నారు. వాహనాలు తనిఖీ చేస్తున్న దృశ్యాలను వీడియో తీశారని తెలిపారు. ఇలా ఆటంకం కలిగించడం తగదని అడిగిన తన పట్ల దురుసుగా ప్రవర్తించారన్నారు. తన వెహికల్ ముందుకు పోకుండా బంపర్‌పై నిలిచి హంగామా చేశారని తెలిపారు. తాలూకా పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు సర్ది చెప్పినా వినకుండా విధులకు ఆటంకం కలిగించారని చెప్పారు. ఈ ఘటన పట్ల తాలూకా పోలీసు స్టేషన్‌లో నిందితుడు చంద్రయ్యపై ఫిర్యాదు చేశామన్నారు. కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా నాలూరు తాలూకా హసావెల్లి ప్రాంతానికి చెందిన వారిగా పోలీసులు విచారణలో తేలిందని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించామన్నారు. వెహికల్ ఇన్‌స్పెక్టర్ వెహికల్, చంద్రయ్య మధ్య జరిగిన ఘటన కొందరు వీడియో తీసి ప్రసార మాధ్యమాల్లో పెట్టడంతో వైరల్‌గా మారింది. ఈ ఘటన పట్ల పలువురు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.



మాట్లాడుతున్న వెహికల్ ఇన్‌స్పెక్టర్



వెహికల్ ఇన్‌స్పెక్టర్ కారు ఎక్కి ఆటంకం కలిగిస్తున్న చంద్రయ్య (ఫైల్)

'ఎండియు' ద్వారానే రేషన్ పంపిణీ చేయాలి : సిపిఎం



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ స్వామి

ప్రజాశక్తి - ఆలూరు

డీలర్ షాపుల నుంచి ప్రజలకు ఇంటికి సరఫరా చేసే రేషన్‌ను ఎండియు ఆపరేటర్ల ద్వారానే పంపిణీ చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణ స్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం జ్యోతిబసు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకుల్లో బియ్యం అక్రమంగా దోచుకోకుండా సన్న బియ్యం ఇస్తూ నూనె, కంది పప్పు, చక్కెర, చింతపండు, పసుపు సరుకులను రేషన్ డీలర్లతో ఎండియు వాహనాల్లో ప్రజలకు ఇంటి వద్దకే చేరవేస్తే బాగుంటుందని తెలిపారు. అందుబాటులో లేని కార్డుదారులకు మరోసారి డీలర్ దగ్గర తీసుకొనే విధంగా ఉండాలని చెప్పారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పునః పరిశీలించాలన్నారు. షాకీర్, కృష్ణ, నాగరాజు, విఠల్ పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు

- నేర నివారణే ప్రథమ కర్తవ్యం
- పెండింగ్ కేసులు తగ్గించాలి
- రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత
- సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి
- సమీక్షలో ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

విధులలో పోలీసులు అలసత్వం ప్రదర్శిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలతో కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీసు అధికారులతో మాట్లాడారు. కర్నూలు , పత్తికొండ , ఆదోని , ఎమ్మిగనూరు సబ్ డివిజన్ లో దీర్ఘకాలంగా ఉన్న పెండింగ్ కేసుల గురించి జిల్లా ఎస్‌పి సమీక్షించి ఆరా తీశారు. పోలీసుస్టేషన్ల వారీగా కేసుల పెండింగ్‌కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పలు సలహాలు, సూచనలు చేశారు. డాభాల్లో మద్యం, ఓపెన్ డ్రింకింగ్, పేకాట వంటి అసాంఘిక కార్యకలపాల పై గట్టి చర్యలు చేపట్టాలన్నారు. అసాంఘిక కార్యకలపాలను ప్రోత్సహిస్తే ఎస్‌పి స్పెషల్ టీమ్స్ రంగంలోకి దిగి దాడులు చేస్తాయన్నారు. పెండింగ్ కేసులు తగ్గించాలన్నారు. మెజిస్ట్రేట్ లను కలిసి పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పెండింగ్ కేసులలో ముద్దాయిల అరెస్టు గురించి ఆరా తీశారు. ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా భాదితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కేసుల దర్యాప్తులపై డిఎస్‌పి స్థాయి అధికారులు ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా హైవే పెట్రోలింగ్ పోలీసులు బాగా పని చేయాలన్నారు. పోలీసు అధికారులు గ్రామాల పర్యటనకు వెళ్ళినప్పుడు రోడ్డు ప్రమాదాల మలుపులు, ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి రేడియం స్టిక్కర్స్, బారికేడ్స్, బ్లింకర్స్, స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఒక్కరి ప్రాణం కాపాడినా వారి కుటుంబాన్ని కాపాడటమేనన్నారు. సైబర్ నేరాల బారిన పడకుం డా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, ఒటిపి ఫ్రాడ్స్ పలు రకాల సైబర్ మోసాలతో ప్రతి రోజుకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.కోటి వరకు ప్రజలు సైబర్ నేరాల బారిన పడి నష్టపోతున్నారన్నారు. డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలన్నారు. మిస్సింగ్ కేసులను చేధించాలన్నారు. అనంతరం గతనెలలో వివిధ కేసుల్లో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులు, పోలీసు సిబ్బందికి ఎస్‌పి ప్రశంసాపత్రాలను అందజేశారు. డిఎస్‌పిలు బాబు ప్రసాద్, ఉపేంద్రబాబు, హేమలత, ఎఆర్‌డిఎస్‌పి భాస్కర్ రావు పాల్గొన్నారు.



కొత్త పాలక వర్గాన్ని ఎన్నుకోవాలి

- కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి : వైసిపి నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు పాలకవర్గాన్ని ఎన్నికల ద్వారా కొత్తగా నియమించాలని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో రాష్ట్ర సహకార శాఖ ప్రత్యేక కమిషనర్, సహకార సంఘాల రిజిస్ట్రార్, కలెక్టర్, జిల్లా సహకార అధికారి, సహకార సంఘాల ఉప రిజిస్ట్రార్‌కు రిజిస్టర్డ్ పోస్టు ద్వారా వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మిగనూరు టౌన్ బ్యాంకు మాజీ ఛైర్మన్, వైసిపి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యుకె.రాజశేఖర్, పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప, మున్సిపల్ వైస్ ఛైర్మన్, వైసిపి నియోజకవర్గ యూత్ అధ్యక్షులు డి.నజీర్ అహ్మద్, జిల్లా చేనేత అధ్యక్షులు ఎంకె.శివప్రసాద్, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరుపాక్షి రెడ్డి, నాయకులు పాల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. భారతీయ సహకార సంఘాల చట్టం ప్రకారం ప్రతి సహకార బ్యాంకు పాలకవర్గాన్ని సభ్యులతో ఎన్నుకోవాలని తెలిపారు. చట్టంలోని సెక్షన్ 31 ప్రకారం పాలకవర్గం పదవీ కాలం ఐదేళ్లకు మించరాదని, ఎన్నికలు నిర్వహించకపోవడం నిబంధనలకు విరుద్ధంగా పరిగణిస్తారని చెప్పారు. ఎమ్మిగనూరు కోఆపరేటివ్ టౌన్ బ్యాంకులో ఎన్నికలు జరిగి దాదాపు 30 ఏళ్లవుతోందని తెలిపారు. 2017లో ఓటర్ల జాబితా సిద్ధమై, ఓటరు కార్డులు పంపిణీ చేసినట్లు, నామినేషన్ల స్వీకరణ పూర్తయిన తర్వాత ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ పూర్తయినప్పటికీ చివరికి నిలిపివేసినట్లు చెప్పారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చాక అధికారులతో చర్చలు జరిపి, ఎన్నికల ప్రక్రియ పునఃప్రారంభించేందుకు కృషి చేసినట్లు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల కారణంగా ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయిందని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలోని మొత్తం 39 సహకార బ్యాంకుల్లో ఎన్నికలు పూర్తయ్యాయని, ఓటింగ్ జరగని ఏకైక బ్యాంకుగా ఎమ్మిగనూరు కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు మిగిలిందని తెలిపారు. ఎలాంటి అడ్డంకులూ లేకపోయినా, ఎన్నికలు జరగకపోవడం వల్ల సభ్యుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, బ్యాంకుపై సభ్యులకు, డిపాజిటర్లకు నమ్మకం తగ్గిందని చెప్పారు. కొంతమంది డిపాజిట్లను వెనక్కి తీసుకోవడం ప్రారంభించారని అన్నారు. ఇది బ్యాంకు ఆర్థిక స్థిరతకు తీవ్ర ముప్పుగా మారే ప్రమాదం ఉందని తెలిపారు. వృద్ధాప్యంలో ఉన్న ఛైర్మన్ ఉరుకుందయ్య శెట్టి వినియోగదారులతో అనుచితంగా ప్రవర్తిస్తున్నారని విమర్శలు వచ్చాయని చెప్పారు. ఓ డైరెక్టర్ తన భార్యను లీగల్ అడ్వయిజర్‌గా నియమించుకోవడం నిబంధనలకు విరుద్ధంగా ఉందన్నారు. డైరెక్టర్ బ్యాంకు నుంచి తీసుకున్న లోన్ తిరిగి చెల్లించకపోవడం వల్ల అవి ఎన్‌పిఎలుగా మారిందని తెలిపారు. బ్యాంకు పేరిట ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుట్టినరోజుకు (ఏప్రిల్ 20) శుభాకాంక్షలు పత్రికల్లో ప్రచురించడం ప్రజాధన దుర్వినియోగానికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రస్తుత పాలకవర్గాన్ని రద్దు చేయాలని, బ్యాంకు సభ్యులతో నేరుగా ఎన్నికల ద్వారా కొత్త పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న టౌన్ బ్యాంక్ మాజీ ఛైర్మన్ రాజశేఖర్, వైసిపి నాయకులు

మహారాజ శ్రీ కర్నూలు నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం.670/2023

బి.దినేష్‌కుమార్. ...వాది

-వర్సెస్-

1.కె. షభానబేగం
2.యస్.ప్రియదర్శిని. ...ప్రతివాదులు

1వ మరియు 2వ ప్రతివాదులకు దావా సమన్లు

1.కె.షభానబేగం భర్త కె.నజీర్ అహమ్మద్, ఇంటి.నెం.46/467, బుధవార్‌పేట, కర్నూలు.
2.యస్.ప్రియదర్శిని తండ్రి దావీద్‌రాజు, ఇంటి.నెం.47/110-ఎ, బుధవార్‌పేట, అవైట్:ఇంటి.నెం.46/467, బుధవార్‌పేట, కర్నూలు.

పై నెంబరు దావాలో వాది, ప్రతివాదుల నుండి ప్రామిసరీ నోటు బాకీ మొత్తం రూ.2,39,586/-లు ఇందుపైన వడ్డీ,కోర్టు ఖర్చులు రాబట్టుకొనుటకు మీపై దావా దాఖలు చేసినారు. ఇందులో 1 మరియు 2 వ ప్రతివాదులు అయిన మీకు పై కోర్టు నుండి పలుమార్లు సమన్లు పంపినను మీకు చేరనందున కోర్టువారు ఈ పత్రిక ద్వారా నమన్లు తెలుపమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున 1 మరియు 2 వ ప్రతివాదులు అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 30-07-2025 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు న్యాయవాది ద్వారా కాని హాజరై మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 30-07-2025

యం.షషివుల్లా అన్సారి
వాది పరం అడ్వకేటు,
కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం.1159/2024

శేగుశివరావు. ...వాది

-వర్సెస్-

అత్తలూరు రామస్వామి. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

అత్తలూరు రామస్వామి తండ్రి ఎ.తిరుపాలయ్య, ఇంటి.నెం.56/10యఫ్, అనంతకొండయ్య గేటు, కర్నూలు.

పై నెంబరు దావాలో వాది, ప్రతివాది అయిన మీ మీద దావా మొత్తము ముందు వడ్డీ కోర్టు ఖర్చులు రాబట్టుకొనుటకు పై కోర్టులో దావా దాఖలు చేసినాడు. సదరు విషయమై పై కోర్టు వారు మీకు పలుమార్లు సమన్లు పంపినను మీకు ముట్టనందున పై కోర్టువారు ఈ పత్రిక ద్వారా సమన్లు తెలుపమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 18-06-2025 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు అడ్వకేటు ద్వారా కాని హాజరై పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారికోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా : 18-6-2025

ఎ. చంద్రమౌళీశ్వరరెడ్డి,
వాది పరం అడ్వకేటు, కర్నూలు.
సెల్:9440014281

మహారాజ శ్రీ కర్నూలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం.754/2023

కె.హనుమంతు. ...వాది

-వర్సెస్-

యస్.సుధాకర్‌రెడ్డి. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

యస్.సుధాకర్‌రెడ్డి తండ్రి యస్.వి.తిమ్మరెడ్డి, గవర్నమెంటు ఉద్యోగం, ఇంటి.నెం.3-129, మేడపైన పెద్దపాడు గ్రామం, కల్లూరు మండలం, కర్నూలు జిల్లా.

పై నెంబరు దావాలో వాది, ప్రతివాది అయిన మీ మీద దావా మొత్తము రూ.5,08,000/- ముందు వడ్డీ కోర్టు ఖర్చులు రాబట్టుకొనుటకు పై కోర్టులో దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 16-7-2025 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు అడ్వకేటు ద్వారా కాని హాజరై పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారికోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా : 16-7-2025

పి. వరప్రసాద్‌రావు,
జి. శ్రీధరరావు,
వాదిపరం అడ్వకేటు,
కర్నూలు.
సెల్: 9849493894

మహారాజ శ్రీ కర్నూలు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఐ.ఎ.నెం.1582/2024 ఇన్ ఓ.యస్.నెం.1159/2024

శేగుశివరావు. ...అర్జీదారు/వాది

-వర్సెస్-

అత్తలూరు రామస్వామి. ...రెస్పాండెంటు/ప్రతివాది

రెస్పాండెంటు / ప్రతివాదికి నోటీసులు

అత్తలూరు రామస్వామి తండ్రి ఎ.తిరుపాలయ్య, ఇంటి.నెం.56/10యఫ్, అనంతకొండయ్య గేటు, కర్నూలు.

పై నెంబరు దావాలో అర్జీదారు/వాది, రెస్పాండెంటు/ప్రతివాది అయిన మీ మీద దావా మొత్తము ముందు వడ్డీ కోర్టు ఖర్చులు రాబట్టుకొనుటకు పై కోర్టులో దావా దాఖలు చేసినాడు. కర్నూలు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నీకు చెందిన ఇ.పి.నెం.127/2021 ఇన్ ఓ.యస్.నెం.768/2018 లో సి.సి.డి లో ఉన్న రూ.1,26,500/- మొత్తమును జప్తి చేయవలసిందిగా అర్జీదాఖలు చేసియున్నాడు. సదరు విషయమై పై కోర్టు వారు మీకు పలుమార్లు నోటీసులు పంపినను మీకు ముట్టనందున పై కోర్టువారు ఈ పత్రిక ద్వారా నోటీసులు తెలుపమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. ఇందులో రెస్పాండెంటు/ప్రతివాది అయిన నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 18-06-2025 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు అడ్వకేటు ద్వారా కాని హాజరై పై కోర్టులో హాజరై తెలుపు కొనగలరు. లేని యెడల సదరు అర్జీ మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారికోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా :18-6-2025

ఎ.చంద్రమౌళీశ్వరరెడ్డి,
వాదిపరం అడ్వకేటు
కర్నూలు.
సెల్:9440014281

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి గారి కోర్టులో
ఐ.ఎ.నెం.1582/2024
ఇన్
సి.యం.ఎ.నెం. /2024

బి.రామాంజనేయులుగౌడు,
తండ్రి సుబ్బయ్యగౌడు,
చల్లావారివీధి, కర్నూలు. ...అర్జీదారు

-వర్సెస్-

1.యం.పెద్దక్క (డైడ్ బై యల్.ఆర్స్)
2.యం.లక్ష్మినారాయణమ్మ భర్త నాగన్నగౌడు ఇంటి.నెం.202,యం.టి.జి.న్యూహౌసింగ్‌కాలనీ, గద్వాల, తెలంగాణ.
3.యం.నాగన్నగౌడు తండ్రి రత్నమయ్యగౌడు, ఇంటి.నెం.87-1047/2, గణేష్‌నగర్, కర్నూలు.
5.చెరుకుచెర్ల గౌరమ్మ భర్త వెంకటేష్‌గౌడు, ఇంటి.నెం.35/114, కుమ్మరివీధి, కర్నూలు.
6.ఈడిగ కళ్యానమ్మ భర్త వెంకటన్న, ఇంటి.నెం.25-48, కొత్తపేట, డోన్, కర్నూలు జిల్లా.
8.కేదార్‌నాథ్‌గౌడు తండ్రి రుద్రగౌడు,
9.సి.కళ్యాణి తండ్రి రుద్రగౌడు, కేరాఫ్ మహలక్ష్మి బంగారుషాపు, షరాఫ్‌బజార్, పాతబస్టాండ్, కర్నూలు.
...రెస్పాండెంట్లు

ఇందుమూలంగా పై కనబరచిన ఐ.ఎ.నెంబరులో రెస్పాండెంట్లు 2,3,5,6,8,9 అయిన మీకు తెలియజేయు విషయం అర్జీదారు అయిన బి.రామాంజనేయులుగౌడు ఇ.ఎ.నెం.23/2022 ఇన్ ఇ.పి.నెం.399/2015 ఇన్ ఓ.యస్.628/2020లో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు తీర్పుపై జిల్లా కోర్టులో అప్పీలు చేసుకొనుటలో 44 రోజులు ఆలస్యమును మన్నించమని అర్జీదారు పై కనబరచిన కోర్టులో అర్జీదాఖలు చేసియున్నారు.సదరు విషయమై రెస్పాండెంట్లు అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 16-06-2025 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు న్యాయవాది ద్వారా కాని హాజరై పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదురు అర్జీని మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారికోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా : 16-6-2025

యల్.విశ్వనాథం,
అర్జీదారు పరం అడ్వకేటు, కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం.25/2024

వీరంరెడ్డి నర్సిరెడ్డి. ...వాది

-వర్సెస్-

శ్రీ యాగంటి గ్రామీణసేవ అసోషియేషన్, బనగానపల్లి, రెప్రజెంటెడ్ బై ఇట్స్ సెక్రేటరి జడ్డు వెంకటక్రిష్ణరెడ్డి, వగైరాలు. ...ప్రతివాదులు

5,6 ప్రతివాదులకు దావా సమన్లు

5.పలుచాని నాగేశ్వరరెడ్డి తండ్రి పి.రాజశేఖర్‌రెడ్డి, ఇంటి.నెం.4/83ఎ, కొత్తపోస్టల్‌కాలనీ, కర్నూలు.
6. నల్లబోతుల గోపాల్‌రెడ్డి తండ్రి నల్లబోతుల సోమిరెడ్డి, ఇంటి.నెం.87/1194-6, రెవెన్యూ కాలనీ-2, కర్నూలు.

పై నెంబరు దావాలో వాది, ప్రతివాదులపైన షెడ్యూలు ఆస్తిపైన ఈక్రింద అంశములపైన దావా దాఖలు చేసినాడు ఇందులో 5,6 ప్రతివాదులైన అయిన నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 23-6-2025 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు అడ్వకేటు ద్వారా కాని హాజరై పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదురు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

A).Declare the title of plaintiff over the plaint schedule property:
B).Declare the Sale Deeds bearing No.1842/2018 dated 6-7-2018 as void and not binding on the Plaintiff, consequently declare Sale Deed bearing No.7791/2020 dated 30-7-2020 as void and not binding on Plaintiff and send the copy of decree to the Sub-Registrar, Kallur as per Section 31(2) of Specific Relief Act for nullifying the entries of registration in his books.
C).Grant consequential injunction restraining defendants and his men over the plain schedule property:
D). Other reliefs as court feels deem fit and proper:

SCHEDULE:The Plot bearing No.177 of Layout bearing 111/1987 of Sy.No.687-A3 of Kallur village, Kallur Sub-Registration and Kurnool Registration District measuring 244.44 square yards and bounded as follows :

East : Plot No.177-A.
West : 33 feet Road.
North : 33 feet Road.
South : Plot No.187.

కోర్టు వారికోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా :23-6-2025

ఎ.రామసుబ్బారెడ్డి,
ఎ.ప్రభాకర్‌రెడ్డి,
వాది పరం అడ్వకేటు,
కర్నూలు.